# కాంతం గార్ల ఇల్లు

(ఆంధ్రులందరూ మునిమాణిక్యాన్నీ, అతని కాంతాన్ని ఎఱుగుదురు. కాని ఈ కథలోని వారి ఇల్లును గురించి, వారి పిల్లలను గురించి, సంగతులు ఇంతవరకు ఎవ్వరికీ తెలియవు)

అది సాయంసమయము, పశ్చిమ దిక్పతి ఎఱ్ఱని గన్నేరు పువ్వు వంటి చీరగట్టుకొని నిండు చంద్రుని లాంటి బొట్టుపెట్టుకొని, చక్కని చుక్కలలాంటి పిల్లలమధ్య నిలబడి ఉండే సమయము.

పొద్దస్తమానము పొలాన ఉండి, ఆ సమయానికి ఆవు ఇంటికి వచ్చి తన దూడలమధ్య నుంచుని మాతృప్రేమను ఒలికిస్తూ ఉంటుంది.

పక్షులు గూళ్ళకు చేరి పిల్లలతో కిచకిచలాడుతూ ఉండే సమయము. ప్రకృతి అంతా ఒక మాతృమూర్తి అయి కనపడే సమయము.

మీరు మా ఇల్లును చూడాలంటే ఆ సమయానికి రండి. ఎంత హాయి అయిన సమయమది. చల్లని సముద్రపు గాలి మీకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

తలవంచుకొని నడువ వద్దు, చూడండి. అటూ ఇటూ చూస్తూ నడవండి. తల్లులు పసిపిల్లల నెత్తుకొని గుజ్జనగూళ్లు పెడుతున్నారు. ఆమె పసిపిల్లవాడి తప్పటడుగుల చూచి ఆనందిస్తోంది. ఈమె తన బిడ్డ ముద్దు పలుకులను విని ఉప్పొంగిపోతోంది.

ఇవన్నీ చూస్తూ ఆ రోడ్డునే సరాసరి వెళ్లండి.

ఆహా ఎంత మంచి సమయము అది; ఆకాశంలో కృత్తిక కనపడుతున్నది. కృత్తికకు తూర్పుగా ఎఱ్ఱని రోహిణి మెరుస్తున్నది. దానికి సమీపంలో మృగశిర చుక్కలు మూడు ముచ్చటగా మిసమిసలాడుతూ ఉన్నవి. ఆవల ఆర్ద్ర ఎఱ్ఱగా ప్రకాశిస్తుంది. ఆరు నక్షత్రాల ముచ్చటైన సమూహం అది.

అయ్యో పిచ్చివాడా ప్రాణం లేని ఆ నక్షత్ర సమూహాన్ని జూచి ముచ్చట పడుతున్నావా!

ఆగు... ఆగు.

అదే మా ఇల్లు.

ఆ అరుగుపైన ఉన్నటువంటి, సజీవమైనటువంటి నక్షత్రషట్కాన్ని జూస్తూ కాస్త నిలవబడు, పిల్లల కోడిలాగ ముచ్చటగా ఉందే, ఆవిడే, దాచటం ఎందుకూ, ఆవిడే మా ఆవిడ.

ఏమిటీ ఆమెపేరు?

సిగ్గుపడతాననుకొన్నారా? ఊఁహు గర్వంగా చెబుతాను మా ఆవిడపేరూ; రాణీసాహెబా కాంతయ్యమ్మారావు బబ్దతుల్ యాకరాన్ సుల్తానాబీగం.

చూడండి ఆవిడను, మా ఆవిడ అందమైన మనిషి కాదూ? అవును చక్కనిమనిషి మటుకు అవును.

చూడండి ఆవిడ అంత పొడుగూ కాదు; అంత పొట్టీగాదూ సరీగా మట్టసంగా ఉంది. అంత అతి చక్కనిదీ కాదూ; అంత అనాకారీ కాదు; కాని చూడటానికి మటుకు ముచ్చటగా ఉంటుంది. ఆవిడ అంత ఎరుపూ గాదూ? అంత నలుపూ గాదు. ఆవిడది అదో తమాషా అయిన రంగు. ఆ రంగు ఈలాంటిదీ అని వర్ణించి చెప్పటానికి వీల్లేదు. అదేమిటో ఒక్క చక్కని శరీరచ్ఛాయ అది, మామంచి అందమైన ఛాయ.

ఇంటావిడను చూశారుగదా, ఇంట్లోకి వెళ్లండి, ఆ హాలులో పిల్లలు ఎక్కే సైకిల్సు రెండు ఉంటాయి. విరిగిపోయిన రెండు మూడు కుర్చీలు అతిథులను ఆహ్వానిస్తూ ఉంటాయి.

కొంచెం అటూ ఇటూ చూస్తిరా కనపడతయి విచిత్రమైన వస్తువులు. తోకలు విరిగిపోయినా పౌరుషం ఏమాత్రం తగ్గలేదు, ఆ గుడ్లు ఉరిమి చూస్తున్న ఆ రెండు కుక్కలకూ, అవి మా ఇంటికి కాపలాగా ఉంటూ వున్నవి.

జూలు వేలాడేసుకొని, భయంకరంగా చూస్తూ అక్కడ పడుకున్నదే, అదే మా సింహము, దానికి ఈ మధ్యనే ప్రమాదవశం చేత కాలు విరిగింది. మా చిట్టి దానికి చికిత్స చేసింది. కాని నయం కాలేదు.

ఆ మూలకు పోకండి. అది ఒక పెద్ద కీకారణ్యము. సింహాలూ, పెద్ద పులులూ, భయంకరమైన కీకారణ్యము, సింహాలూ, పెద్ద పులులూ, భయంకరమైన అడవి ఏనుగులూ, జర జరపారే పాములూ, అక్కడే ఉన్నవి. రాధా విజయలు, ఆ అరణ్యాన్ని కాపాడుతూ ఉంటారు. వాళ్లు మహా యోధులు, సింహాలను మీసాలు పట్టుకొనిఊపగలరు. ఏనుగుల కాళ్ళు ఫెళ్లున ఒక చేత్తో విరిచి వేయగలరు. పెద్ద పులి మెడకు ఒక గుడ్డ పేలిక కట్టి అమాంతం అంత పెద్దపులినీ, పెంపుడు కుక్కపిల్ల లాగ జరజరా ఈడ్వగలదు, మా విజయ.

ఆ అడివి మృగాలను జూచి భయపడి కాబోలు చాలాదూరంగా ఈ మూలన నక్కి కూర్చున్న ఆ తెల్లటి పిల్లి మా రాధిగాడిది. ఇవ్వాళ దానికేదో శరీరంలో కించత్ అస్వస్తత కలగటం మూలాన మా వాడు దానిని ముమ్మాటు తొట్టి స్నానంజేయించి, తదుపరి మృత్తికాచికిత్స చేశాడు. అందు మూలాన అది అల్లాగ ఏడుస్తూ ఉంది. ఇంకా ఉన్నయి విచిత్రాలు. ఆ హాలు ఒక చిన్న చిత్రవస్తు ప్రదర్శనశాల.

గుడ్డ పేలికలు ఇంటినిండా ఎందుకు ఉన్నాయా అని సందేహించకండి, ఆ సింహాలనూ, వాటని కట్టి వేయటానికి అవే సాధనాలు.

కుక్కలు కరుస్తాయా అని అడగండి అ పసిదాన్ని. కరవవు అంటుంది. ఎందుచేతా? ననండి. "పెంపుడివి" అంటుంది. పెంపుడు కుక్కలట అవీ! అందుచేత కరవవట!

అయితే దాన్ని అట్టే మాట్లాడించకండి. చాలా ప్రమాదమైన విషయము. దానికి కోపంవచ్చిందా సింహాన్నో, పెద్దపులినో తీసుకొచ్చి మిమ్ములను కరిపించగలదు. వాటి దుంపతెగా, ఆ సింహాలు అది కరవమంటే ఠకీని కరచి ఊరుకొంటాయి. అది మళ్లీ, వద్దు వద్దు అంటే మానేస్తయి. ఆ విజయతో మరో ఇబ్బందికూడా ఉంది మీకు అది సింహాన్ని తీసుకొచ్చి, మీ ముందు పెట్టి "కరు" అన్నప్పుడు, మీరు భయంతో వణికిపోయి అమాంతం వెల్లకిలా పడిపోయి "అమ్మో, అమ్మో వద్దమ్మా నాకు భయమేస్తున్నది' అని అంటిరా అది సంతోషించి సింహాన్ని అవతలకు లాగేస్తుంది. మీరు బ్రతికి బైట పడతారు. ఈ రహస్యం తెలియక మీరు, చూస్తూ, నివ్వెరపోయి అల్లాగే ఉన్నారా.... ఇక ఆ సింహము మీ వళ్లు అంతా రక్కి కరవటమే కాకుండా,

అది కూడా పెద్దగా ఏడుస్తూ కూర్చుంటుంది.

ఇంకా మాట్లాడిస్తిరా, దాన్ని, ఇక మీరు ఆపూట అన్నం మానుకోవలసిందే. వాళ్ల అమ్మనడిగి బొమ్మలపెట్టె పైనుంచి దింపించి మీ ముందు పెట్టి కొండపల్లి భోగంవాళ్ళచేత ఆడిస్తుంది. బెంగుళూరి తాయిచేత పాడిస్తుంది. దొరసానులనూ, దొరలనూ రప్పించి డాన్సు చేయిస్తుంది. మీరు సంతోషించినట్లు కనపడకపోతే పెద్దగా ఏడుస్తుంది.

ఆ గోడలమీద కనపడే ఫోటోలు అన్నీ మీరు చూడనక్కరలేదు. అందులో ఒక చెట్టు వుంది, చూడండి, తెల్లని మొదలూ, పసుపు పచ్చని శాఖలూ, నల్లటి పండ్లూ, ఎర్రని ఆకులూనూ! మా ఆవిడ స్వంతంగా ఊహించి అందంగా కుట్టిన చెట్టు అదీ. అతిధి అన్న వాడు ప్రతీవాడూ, దాన్ని చూచి ఆశ్చర్యపడుతూ ఉంటాడు. ఆ వృక్షరాజాన్ని జూచీ, ఆ రంగుల మిశ్రమాన్ని జూచీ మెచ్చుకోనివాడు లేడు.

మా ఆవిడకూడా తన స్నేహితురాండ్రకు దాన్ని చూపించి మన్ననలను పొంది గర్వపడుతూ ఉంటుంది. "ఆయనకీ సరదా లేమీ లేవండీ, ఇంకేమైనా రంగులో వున్న ఊలు తెమ్మంటే తెచ్చారుకారు ఆయన" అనికూడా అంటూ ఉంటుంది.

ఆ రెండో పటంలో రెండు హంసలు ఎదురుబొదురుగా నుంచుని ముక్కలతో ఒక పూలగుత్తిని ఎత్తి పట్టుకొన్నవి.

ఆ పటం క్రింద 'హంసలు' అని నేనే సిరాతో పెద్ద అక్షరాలు దిద్దాను. చూసేవారు అనవసరంగా "ఏమిటివి?" అనే ప్రశ్నలు, వేయకుండా, అవి హంసలు అని తెలుసు కొంటానికి.

ఆ చంటిపిల్లను విజయనూ, ఎడ పిల్లవాడ్ని రాధిగాడ్ని చూశారు కాబట్టి మిగతా ముగ్గురు పెద్ద పిల్లలనూ చూస్తే మీకు మా సంసారంతో పరిచయం గలిగినట్లే.

పెద్దది మీతో మాట్లాడదు. దానికి సిగ్గు. దాన్ని వదలివేశెయ్యండి. ఆ రెండోదాన్ని దగ్గరకు పిలవండి వస్తుంది. ఇప్పటికి అది మూడువేల అయిదువందల అరవై అయిదు పెండ్లిండ్లు చేసింది. ఇంకా చేస్తున్నది. శారదా చట్టము, అది చేసే పెండ్లిండ్లకు ఏమీ అడ్డురాదు, దాని ఊహలో జీవితం నిత్యకళ్యాణం పచ్చతోరణం, దానికి పదో ఏడు.

ఆ తరువాత పుట్టింది మగబిడ్డ. పుట్టుశాస్త్రి. అఖండమైన తెలివైనవాడని వాళ్ళమ్మ ఉద్దేశం. వందలకు వందలు సంపాదించి తల్లిచేతుల్లో పోసి మాతృపూజ చేస్తాడని ఆ పిచ్చి తల్లి ఊహిస్తున్నది. ఆమె ఊహలో వాడూ....

హైకమీషనర్ ఆఫ్ పోలీసు కావచ్చు.

లేకపోతే, మద్రాసు అండ్ సదరన్ మరాటా రైల్వే కంపెనీలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ సూపరింటెండు కావచ్చు. ఇంకా దేముడిదయ ఉంటే

పోస్టుమాస్టరు జనరల్ ఆఫ్ ది మద్రాసు ప్రెసిడెన్సీ కావచ్చు.

కాని ఒక్క విషయం మాత్రం మా కాంతం గట్టిగా చెపుతుంది. "మా అబ్బాయి, స్కూలు మాస్టరు మటుకు ఎప్పుడూ కాదు. పిచ్చికమ్మ, కాకమ్మ కథలు వ్రాయడు వాళ్ళ నాన్న మోస్తరు" అని

"ఏమండీ కథలు వ్రాస్తే? వాళ్ల నాన్న మంచి కథలే వ్రాస్తాడే. మీ అబ్బాయి కూడా మంచి కథలు వ్రాసి వాళ్ళ నాన్నకంటే గొప్పవాడు కావాలని మీకు కోరిక లేదండీ" అని మీరు అంటారు -

"మీరు కూడా అల్లాగ అంటారేం! ఎందుకొచ్చిన కథలండీ, ఇవన్నీ, కూటికొచ్చినట్లా, గుడ్డకొచ్చినట్లా - అందులో... వీళ్ల నాన్న వ్రాసే కథలే చెప్పాలా! - ఏం భాగ్యం ఇటువంటి కథలు వ్రాయటం. ప్రతీవాడు వ్రాయవచ్చు. ప్రతీవాడూ వ్రాస్తున్నాడు, నేనూ - మా సుబ్బులూ అనీ- నేనూ, మా జానికమ్మా అని అంటుంది ఆవిడ తప్పకుండా."

*('ఆంధ్రభూమి' మాసపత్రిక, ఆగస్టు 1938)*